కన్వేయర్ బెల్ట్ పనులు అడ్డుకున్న రైతులు

భూపాలపల్లి రూరల్, జనవరి 10 : భూపాలపల్లి మండలం జంగేడు శివారులో తాడిచర్ల ఓసీ నుంచి జెన్‌కోకు వేయనున్న కన్వేయర్‌బెల్ట్ పనులకు లెవలింగ్ చేయిస్తుండగా, శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమకు తెలియకుండా పనులు చేస్తున్నారని, పరిహారం చెల్లించే వరకూ పనులను అడ్డుకుంటామన్నారు. 965, 978, 967, 962 సర్వే నంబర్లలో భూములు ఉన్న కొండముచ్చు నాగరాజు, తుల రాజయ్య, బొట్ల రవి, పోలవెన ఐలయ్య తమ భూములకు పరిహారమిచ్చి, ఉద్యోగాలు కల్పించి పనులు చేయాలని డిమాండ్ చేశారు. కన్వేయర్ బెల్ట్ కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వే జరిగిందని, పరిహారం సైతం నిర్ణయించారని, రైతులందరూ సంతకాలు చేశారని ఉద్యోగులు తెలిపారు.

కన్వేయర్ బెల్ట్ పనులను అడ్డుకుంటున్న జంగేడు శివారు రైతులు

ఎల్టా ఐ-పాస్ పుస్తక ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్, జనవరి 10 : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) సభ్యులు ప్రిపేర్ చేసిన ఐ-పాస్ పుస్తకాన్ని శుక్రవారం డీఈవో ఎం రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లం బోధించే నిష్ణాతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో తయారు చేసిన ఈ పుస్తకం విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో చాలా ఉపయోగపడుతుందన్నారు. ఎల్టా జిల్లా అధ్యక్షుడు బాలశౌరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లంలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతి సంవత్సరం కొత్త ఐ-పాస్ పుస్తకాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ గిరిధర్, కోశాధికారి గోసుకుల వీరన్న, రాష్ట్ర కార్యదర్శి నవనీత్, ఇంగ్లిష్ భాషోపాధ్యాయులు నరేందర్, అమరేందర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

మేడారంలో పారిశుధ్య పనులు

తాడ్వాయి, జనవరి10 : మేడారం జాతర పరిసరాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను డీపీవో దేవరాజు శుక్రవారం పరిశీలించారు. మినీ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో వన దేవతలు సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ముందస్తుగా తరలివస్తున్నారు. దీంతో జాతర పరిసరాల్లో పారిశుధ్య పనులను రాజమండ్రికి చెందిన కూలీలతో చేపడుతున్నారు. ఈ మేరకు డీపీవో స్నానఘట్టాలు, ఆర్టీసీ బస్టాండ్, చిలుకల గుట్ట, గద్దెల పరిసరాలను పరిశీలించారు. అనంతరం భక్తుల విడిది షెడ్లలో జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అమ్మవార్లను ఆయన దర్శించుకొని పూజలు చేశారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

రికార్డులను పరిశీలిస్తున్న గోపాల్‌రావు

ములుగురూరల్, జనవరి 10 : మండలంలోని జంగాలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో గోపాల్‌రావు తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణులు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించి వ్యాధి నిరోధక టీకాలతో కలిగే లాభాలను తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డెమో సంపత్, ఆరోగ్య కార్యకర్త రమ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

టేకుమట్ల, జనవరి 10 : మండలంలోని ఆశిరెడ్డిపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జెట్టి మహేందర్ తండ్రి ఇటీవల మరణించగా శుక్రవారం జరిగిన దశ దిన కర్మలో పార్టీ మండల నాయకులు పాల్గొని మృతుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామక్రిష్టాపూర్ (వి)లో టేకుమట్ల కార్యదర్శి అడగాని సాంబశివరావు తండ్రి ప్రథమ వర్ధంతికి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవెని ఐలయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, నాయకులు ఆది రఘు, బందేల నరేశ్, మారం లింగారెడ్డి, ఉద్దమారి మహేశ్, పొన్నం చెంద్రయ్య, గువ్వాడి లక్ష్మణ్, మేకల రాజు, గ్రామ అధ్యక్షుడు అచ్చె లచ్చయ్య పాల్గొన్నారు.

జగన్నాథపురం వైజంక్షన్ వద్ద 163వ జాతీయ రహదారి

వైజంక్షన్‌లో పేర్లు లేకుండా ఉన్న సూచిక బోర్డు

వామ్మో జగన్నాథపురం వై జంక్షన్!

- ప్రమాదాలతో అనుక్షణం టెన్షన్!
- దెబ్బ తిన్న డివైడర్లు.. పట్టించుకోని అధికారులు
- సూచిక బోర్డులపై కానరాని గ్రామాల పేర్లు

వాజేడు, జనవరి 10 : మండలంలోని జగన్నాథపురం వై జంక్షన్‌లో ప్రయాణికులు నిత్యం టెన్షన్ పడుతున్నారు. ఇక్కడి హైదరాబాద్ టు భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో ఛత్తీస్‌గఢ్, వెంకటాపురం, భద్రాచలం, ఏటూరునాగారం, హనుమకొండ వైపు వెళ్లే విధంగా ఇక్కడ జాతీయ రహదారి అధికారులు డివైడర్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ రహదారిపై నిత్యం ఇసుక లారీలతోపాటు పలు వాహనాలు అతివేగంగా వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్లను ఢీ కొడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో డివైడర్ల సిమెంట్ దిమ్మలు విరిగి ప్రమాదకరంగా పడి ఉంటున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. వాహనదారుల సౌకర్యార్థం గతంలో అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సూచిక బోర్డులపై ఎలాంటి గ్రామాల పేర్లు కనిపించకపోవడంతో రాత్రి సమయాల్లో వెళ్లే వాహనదారులు దారితెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధితశాఖ అధికారులు పట్టించుకొని జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామాల పేర్లు కనిపించేవిధంగా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

వేంకటేశ్వరాలయంలో గండ్ర దంపతుల పూజలు

భూపాలపల్లి రూరల్/ చిట్యాల, జనవరి 10 : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్ వేంటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వారా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దర్శనం చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు వారు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిట్యాల మండలం నైన్‌పాక శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై ఉత్తర ద్వారం ద్వారా మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి : ఎస్పీ

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

గణపురం, జనవరి 10 : రోడ్డు భద్రత నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ సంధాని ఆధ్వర్యంలో చెల్పూరులో నిర్వహించిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవ కార్యక్రమానికి ఎస్పీ హాజరై గోడ పత్రికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించగా వంద మంది డ్రైవర్లు సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, గతంలో జరిగిన ప్రమాదాలను గుర్తు చేశారు. ఈనెల 31 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు జరుగుతాయని, రోడ్డు రవాణా శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో హెవీ డ్రైవర్లు, పాఠశాలలు, కళాశాలల డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, రవాణా శాఖ ఏవో శ్రీనివాస్, ఆప్తమాలజిస్ట్ రవికుమార్, ఎస్సై రేఖ అశోక్, ఏఎంవీఐలు సుందర్‌లాల్, శ్రీనివాస్, కార్యాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లా కోర్టులో ముగ్గుల పోటీలు

కృష్ణకాలనీ, జనవరి 10 : సంక్రాంతిని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా సిబ్బంది, న్యాయవాదులు రంగవల్లులతో కోర్టు ప్రాంగణాన్ని మెరిపించారు. విజేతలుగా నిలిచిన వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ములుగురూరల్/ కాటారం/ కృష్ణకాలనీ/ మహదేవపూర్, జనవరి 10 : ములు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో నేడు నేడు విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ములుగు జిల్లాలో 33/11కేవీ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా ములుగు, మల్లంపల్లి, రామచంద్రాపురం, వెంకటాపూర్, వెళ్తుర్లపల్లి, గోవిందరావుపేట, పస్రా, తాడ్వాయి, మేడారం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, కమలాపురం, మల్లూరు, వాజేడు, వెంకటాపురం(నూగూరు), అలుబాక ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కాటారం మండలం కాటారం, మహదేవపూర్, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగరాజు పేర్కొన్నారు. భూపాలపల్లి సబ్ స్టేషన్‌లో ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు, జంగేడు సబ్ స్టేషన్‌లో 9:30 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు భూపాలపల్లి టౌన్ ఏఈ తెలిపారు. మహదేవపూర్ మండలకేంద్రంతో పాటు సూరారం, కాళేశ్వరం, పెద్దంపేట గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి

మహాముత్తారం, జనవరి 10 : మండలంలోని కొర్లకుంట జీపీ పరిధి చిన్నతండా, లంబాడిపల్లి, శ్రీపాదకాలనీ, బోర్లగూడెం పంచాయతీ పరిధి గజరాంపల్లి గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. తక్షణమే ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. కొర్లకుంట మాజీ ఉప సర్పంచులు తిరుపతి, సమ్మయ్య, గ్రామస్తులు కండెల శ్రీను, అర్జున్, రామ్ సందేశ్, ఉదయ్ సింగ్ పాల్గొన్నారు.

అపార్ ఐడీ నమోదు చేయాలి

ఏటూరునాగారం, జనవరి 10 : ప్రతీ విద్యార్థి ఆపార్ ఐడీని నమోదు చేయాలని సమగ్ర శిక్ష సెక్టోరోల్ అధికారి అర్షం రాజు కోరారు. మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్స్, కంప్యూటర్ ఆపరేటర్లతో శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ నూతన విద్యా విధానం-2020 సిఫారసుల మేరకు వన్ నేషన్-వన్ స్టూడెంట్ కోసం పన్నెండు అంకెల గుర్తింపు సంఖ్య ఇచ్చే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. శిశు తరగతి నుంచి ఉన్నత విద్య పూర్తయ్యే వరకు ఇదే నంబర్ ఉంటుందన్నారు. గుర్తింపు సంఖ్యను ట్రాక్ చేయడం ద్వారా విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించడం, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లిన విద్యార్థి అభ్యాసన, సామర్థ్యాలను పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగ అన్‌లైన్ అప్లికేషన్లను త్వరగా పూరించేందుకు భౌతికంగా సర్టిఫికెట్లు ఉండాల్సిన అవసరం లేకుండా డీజీ లాకర్ ద్వారా విద్యార్థి వివరాలు నిక్షిప్తం అవుతాయన్నారు. శిశు నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల ఆపార్ ఐడీ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఏటీడీవో క్షేత్రయ్య, ఏసీఎంవో రవీందర్, జీసీడీవో సుగుణ పాల్గొన్నారు.

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

భూపాలపల్లి డీఈవో రాజేందర్

భూపాలపల్లి రూరల్, జనవరి 10 : భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో రాజేందర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హైయ్యర్ అభ్యర్థులు జనవరి11, 12, 16,17 తేదీల్లో ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు ఈనెల 11న, హైయ్యర్ పరీక్షలు జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం ఉంటాయన్నారు. అభ్యర్థులు www.bsetelangana.com ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని సకాలంలో పరీక్షా కేంద్రాని చేరుకోవాలన్నారు. టైలరింగ్ అభ్యర్థులు వారి సొంత మిషన్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

తాడిచెర్ల కళాశాలకు పరీక్ష కేంద్రం మంజూరు

మల్హర్, జనవరి 10 : మండలంలోని తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేసినట్లు తాజా మాజీ ఎంపీపీ మల్హర్‌రావు తెలిపారు. గతంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలోపు పరీక్ష కేంద్రం ఏర్పాటు, ప్రధాన రోడ్డు నుంచి కళాశాల వరకు రూ.30లక్షలతో సీసీ రోడ్డు, కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన మాజీ ఎంపీపీ మల్హర్ రావుకు కళాశాల ప్రిన్సిపాల్ విజయాదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేశారపు చంద్రయ్య, ఇందారపు చంద్రయ్య, బొబ్బిలి రాజు, బూడిద రాజు, సమ్మయ్య, రాగం రమేశ్, మేరగు రాజయ్య, మధుసూదన్, చంద్రమొగిలి పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లాలో నలుగురు ఎస్సైల బదిలీ

భూపాలపల్లి రూరల్, జనవరి 10 : జిల్లాలో నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలిమెల ఎస్సై తమాషారెడ్డిని కాళేశ్వరం పీఎస్‌కు, సీసీఎస్ భూపాలపల్లి ఎస్సై జె రమేశ్ పలిమెల పీఎస్‌కు, భూపాలపల్లి ఎస్సై సుధాకర్‌ను టేకుమట్ల పీఎస్‌కు, సీసీఎస్ ఎస్సైగా పనిచేస్తున్న సాంబమూర్తినిభూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ బదిలీ చేశారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టేకుమట్ల, జనవరి 10 : సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని మండలంలోని అంకుశాపూర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ గౌడ్, శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మియాపురం హరీశ్, తోట గట్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు అందించిన క్రికెట్ బ్యాట్లను, టీషర్టులను క్రీడాకారులకు వారు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోతన వేణి ఐలయ్య, మాజీ సర్పంచ్ నందికొండ రామిరెడ్డి, ఆకోజు వేణు, డాక్టర్ రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ అవినీతిపై విచారణ జరపాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 10 : గణపురం మండలంలోని గణపసముద్రం రిజర్వాయర్ లో ఉచిత చేప పిల్లలు వేయడంలో మత్స్య శాఖాధికారులు, సీడ్ కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడ్డారని సంఘం చైర్మన్ మల్లెబోయిన రాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయన మాట్లాడారు. గణపసముద్రం రిజర్వాయర్‌లో 1.36 లక్షల ఉచిత చేప పిల్లలు వేసి, మత్స్య శాఖాధికారులు, సీడ్ కాంట్రాక్టర్లు తమతో సంతకాలు తీసుకొని 7,24,493 ఉచిత చేప పిల్లలు వేసినట్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగతా సీడ్ ఎప్పుడు వస్తుందని అధికారులను అడిగితే త్వరలో వస్తుందని అధికారులు మాయా మాటలు చెప్తున్నారన్నారు. కలెక్టర్ విచారణ జరిపి, అవినీతికి పాల్పడిన జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాశ్, సీడ్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు గుండ్ల రాజు, ప్రధాన కార్యదర్శి కొంతం గణపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కారు బోల్తా : తప్పిన ప్రమాదం

గోవిందరావుపేట, జనవరి 10 : మండలకేంద్రంలోని తెలంగాణ సీడ్స్ సమీపంలో శుక్రవారం రాత్రి కారు బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు మూలమలుపు వద్ద చీకట్లో ఆగి ఉన్న లారీని ఒక్క సారిగా తప్పించబోయి కుడి వైపునకు డ్రైవర్ స్టీరింగ్ తిప్పడంతో మూడు పల్టీలు కొట్టి జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలాలో బోల్తా పడింది. కారులో ఉన్న ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఈజీఎస్ పనుల అవకతవకలపై ఆగ్రహం

మొగుళ్లపల్లి, జనవరి 10 : ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ పనులకు సంబంధించి 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం రాత్రి వరకూ కొనసాగింది. గ్రామాల్లో జరిగిన పనుల తనిఖీల వివరాలను బృందాలు ప్రజా వేదికలో వెల్లడించాయి. గ్రామాల వారీగా జరిగిన అక్రమాలు, రికార్డుల్లో జరిగిన పొరపాట్లను డీఆర్పీలు సభలో వెల్లడించారు. అవకతవకలపై ఈజీఎస్ సిబ్బందిని ఏపీడీ మంజులాదేవి ప్రశ్నించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, జిల్లా అంబుడ్స్‌మన్ శ్రీనివాస్, ఎంపీడీవో మహబూబ్ హుస్సేన్, ఇన్‌చార్జి ఏపీవో అలీం, ఇన్‌చార్జి ఈసీ కిరణ్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మొగుళ్లపల్లి, జనవరి 10 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దొంగల నరేశ్ (35) మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల నుంచి అతిగా మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. శుక్రవారం మద్యం మత్తులో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. పక్క పొలాల్లోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం చిట్యాల సామాజిక ఆసుపత్రి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ వెల్లడించారు.

చెల్పూర్ కార్యదర్శిగా హేమంత్

గణపురం, జనవరి10 మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ముక్కెర హేమంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన హరిచంద్రా రెడ్డి డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందారు. నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన హేమంత్ కు ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు జీపీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి

కృష్ణ కాలనీ, జనవరి 10: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు-లక్ష డప్పుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి మాదిగ అధ్యక్షతన మహా ప్రదర్శన విజయవంతానికి సన్నాహక కళాకారుల రథయాత్ర ముగింపు సభ నిర్వహించగా మంద కుమార్ మాదిగ హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు తక్షణమే వర్గీకరణ అమలు తీసుకురాకపోతే రాజకీయంగా శాశ్వతంగా బొంద పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాదిగ కళాకారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు ప్రారంభం

ములుగురూరల్, జనవరి 10 : కొత్తూరు దేవుగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ నితిన్ రావు లక్ష్మీ నర్సింహస్వామి క్రికెట్ కప్ ఏర్పాటు చేసి సొంత ఊరి కోసం ఏదో చేయాలనే మంచి ఆలోచనతో క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమనేని కిషన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును.
No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పురోహితులతో మాట్లాడుతున్న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

మహదేవపూర్(కాళేశ్వరం), జనవరి 10 : కాళేశ్వర ముక్తీశ్వర క్షేత్రంలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలో మే నెలలో నిర్వహించే సరస్వతీ పుష్కరాలు, మహ కుంభాభిషేకం, ఆలయ అభివృద్ధి పనులపై లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల 7 నుంచి 9 వరకు మూడు రోజులపాటు జరిగే మహాకుంభాభిషేకానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మేలో నిర్వహించే సరస్వతీ పుష్కరాలకు 19 లైన్ డిపార్ట్‌మెంట్ల ద్వారా ఏర్పాట్లు చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతోపాటు ఇతర జిల్లాల నుంచి సుమారు రోజుకు 50వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వాహనాల పార్కింగ్ సౌకర్యంతోపాటు వన్ వే రూట్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ ద్వారా అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు ఏ ర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈవో మారుతి, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

రూ.18వేలు వేతనం ప్రకటించాలి

ములుగురూరల్, జనవరి 10 : బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18వేలు వేతనం ప్రటించాలని ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రత్నం నీలాదేవి, ఉపాధ్యక్షుడు గుండెబోయిన రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని పోస్టు ఆఫీస్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఈ క్రమంలో పోలీసులు మధ్యలో అడ్డుకొని మంత్రి సీతక్క పీఏ విజయ్‌కుమార్‌ను తీసుకువచ్చి వినతిపత్రం అందింపజేశారని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే రిలే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

గణపురం/ ఏటూరునాగారం/ మంగపేట/ మల్హర్/ ములుగు రూరల్, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆయా పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో రంగులతో ముగ్గులు వేశారు. గణపురం మండలం చెల్పూర్, మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలల హెచ్ఎంలు దేసు సతీశ్‌కుమార్, అశోక్, ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం దూలం కుమారస్వామి, ప్రొబెల్ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ల్యాదళ్ల కృష్ణ కరస్పాండెంట్ పబ్బు శివ శంకర్, శ్రీనారాయణ హైస్కూల్‌లో చైర్మన్ రవి, కరస్పాండెంట్ అనిశెట్టి భానుచందర్, బస్వరాజుపల్లిలోని శ్రీ నేతాజీ హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఉడుత సాంబయ్య యాదవ్, చెల్పూర్‌లోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ గ్యాదంగి సతీశ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రధానం చేశారు. ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్ మెంటు సెల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు.అనంతరం విద్యార్థులకు మెహందీ బ్రైడల్ ఆర్ట్ కాంపిటీషన్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఫాతిమా, నవీన్, వెంకటయ్య, జ్యోతి, సంపత్, జీవవేణి, రమేశ్, మున్ని, విజయలక్ష్మి పాల్గొన్నారు. మంగపేట మండలకేంద్రంలోని హైస్కూల్‌లో ఎంఈవో పోదెం మేనక ఆధ్వర్యంలో భోగి మంటలు ఏర్పాటు చేసి, రంగవల్లులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, సామ్రాజ్యం, హెచ్ఎం వెంకటస్వామి పాల్గొన్నారు. మల్హర్ మండలం పెద్దతూండ్ల పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అందంగా అలంకరించిన విజేతలకు బహుమతులు అందజేశారు. ములుగు మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాల, బరిలానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు తిరుణహరి మనోహర్, ఇర్ఫాన్‌పాషా ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దేవకి, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం అంగన్‌వాడి టీచర్ ప్రమీల పాల్గొన్నారు.



మంగపేట : భోగి మంటలు వేసి మానవహారంగా ఉన్న విద్యార్థులు

గణపురం : సంక్రాంతి ముగ్గు వేసి కూర్చున్న విద్యార్థులు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మొగుళ్లపల్లి, జనవరి 10 : ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా మంజూరైన 60 యూనిట్ల పెరటి కోళ్లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఆర్ఐ సురేందర్‌రెడ్డి, ఏపీఎం అంబాల రవివర్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు బండారి మంజుల, సీసీలు గాజుల బాబూరావు, బత్తిని శ్రీనివాస్, బత్తిని ప్రవీణ్, సీబీవో లడే తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

తాడ్వాయి, జనవరి10 : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందితో కలిసి మేడారంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు పరిసర ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు.